సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 23 । మే । 2025



భాగ్యరెడ్డి వర్మకు..
దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ జయంతిని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.
- 8లో ▸



సొంతింటి కల..
పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
35.3 /22.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

భూ భారతి సర్వేను వేగవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): భూ భారతి సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. లింగంపేట తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూ భారతి సర్వే డెస్క్‌ను కలెక్టర్ గురువారం పరిశీలించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద లింగంపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించామని, 4225 దరఖాస్తులు అందాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో 4100 దరఖాస్తులను పరిశీలించి, సర్వే చేయడం జరిగిందన్నారు. డెస్క్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ కిరణ్మయి, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

26న సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8గంటలకు కామారెడ్డిలోని ఇందిరా గాంధీ స్టేడియంలో అండర్–8, 10, 12 అథ్లెటిక్స్ (బాలబాలికల విభాగం) ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 60 మీటర్లు, 200, 300, 600 మీటర్ల స్టాండింగ్ బ్రాడ్‌జంప్, లాంగ్‌జంప్, కిడ్స్ జావెలిన్, షాట్‌పుట్ అంశాల్లో ఎంపికలుంటాయని, పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు




కామారెడ్డి టౌన్: సరస్వతి పుష్కరాల సందర్భంగా కామారెడ్డి నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. ప్రతి రోజూ సూపర్ లగ్జరీ బస్సు సాయంత్రం 4 గంటలకు కామారెడ్డి నుంచి, తిరిగి కాళేశ్వరం నుంచి ఉదయం 6గంటలకు బయలుదేరుతుందన్నారు. పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.180 బస్సు చార్జీలు ఉంటాయని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పదోన్నతి బాధ్యతను పెంచుతుంది



కామారెడ్డి క్రైం: పదోన్నతులు బాధ్యతలను మరింత పెంచుతాయని ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు. ఇటీవల ఎస్సైలుగా పదోన్నతి పొందిన 11 మంది ఏఎస్సైలకు ఎస్పీ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాయితీగా, రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలందించాలన్నారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, మర్యాదలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు మదన్‌లాల్, యాకూబ్‌రెడ్డి, సీఐలు తిరుపతయ్య, సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వంటగది సిలిండర్ లీకేజీ ప్రమాదాలను తినే సోడాతో ఆర్పివేయడం, ఆయిల్ ఫైర్‌లను మూత కప్పడం ద్వారా ఆర్పివేయడం, పిడుగుపాటు సమయంలో పాటించాల్సిన మెలకువలు, వివిధ రకాల అగ్నిప్రమాదాల్లో ఉపయోగించే పరికరాల వాడకంపై జిల్లా ఫైర్ అధికారి సుధాకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తే బకాయి బాధ లేదు



సుభాష్‌రోడ్‌లో ఓ వ్యాపారి తన దుకాణానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్‌ను 9 ఏళ్లుగా రెన్యువల్ చేసుకోకపోవడంతో బల్దియాకు రూ.27వేలకు పైగా బకాయి పడ్డాడు. నిబంధనల ప్రకారం బకాయిలను వసూలు చేసి అదే ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. కానీ సదరు వ్యాపారి నుంచి రూ.7వేలు తీసుకుని పాత ట్రేడ్ లైసెన్స్ స్థానంలో రూ.2100 బల్దియాకు జమ చేసి నూతన లైసెన్స్‌ను జారీ చేశారు. ఫలితంగా బల్దియాకు రూ.27వేలు రాకుండాపోయాయి.

పాత పట్టణంలో ఓ వ్యాపార అసోసియేషన్ 9 దుకాణాల ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోకపోవడంతో రూ.1.30లక్షలకు పైగా బకాయిలున్నాయి. ఆ యజమానుల నుంచి లైసెన్స్‌లను రెన్యువల్ చేసి డబ్బులు బల్దియాకు జమ చేయాల్సి ఉంటుంది. కానీ వాటి స్థానంలో నూతన లైసెన్స్‌లను జారీ చేస్తామని బల్దియా సిబ్బంది రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకుని వాటి స్థానంలో నూతన లైసెన్స్‌లను జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇలాంటి వ్యవహారాలు బల్దియాలో చాలా ఉన్నాయి.

ట్రేడ్ లైసెన్స్ జారీలో ఇష్టారాజ్యం

- జేబులు నింపితే పాత బకాయిలు ఊసే ఉండదు
- పాత దుకాణానికి కొత్త లైసెన్స్ రెడీ
- బల్దియా ఆదాయానికి గండికొడుతున్న సిబ్బంది



కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. శానిటేషన్ విభాగంలో ట్రేడ్ లైసెన్స్ జారీలో బల్దియా ఆదాయాన్ని పెంచే సిబ్బంది అక్రమ సంపాదన కోసం ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పైసలిస్తేనే ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేస్తున్నారని కొందరు, రెన్యువల్ చేయాల్సిన లైసెన్స్‌లను పట్టించుకోకుండా వాటి స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా నూతన లైసెన్స్‌లు జారీ చేస్తున్నారని మరికొందరు ఆరోపిస్తున్నారు.

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులు ఉండగా, లక్షకు పైగా జనాభా, 24,484 ఇళ్లు ఉన్నాయి. పట్టణంలో ప్రతి ఏటా 4,800కు పైగా ట్రేడ్‌లైసెన్స్‌లు జారీ చేయగా వాటి ద్వారా రూ.36లక్షల నుంచి రూ.40లక్షల వరకు బల్దియాకు ఆదాయం సమకూరుతోంది. అధికారులు క్షేత్ర స్థాయిలో నిబంధనల ప్రకారం వ్యాపార దుకాణాల విస్తీర్ణం, కొలతలను నిజాయితీగా తీసుకుని ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేస్తే మరో రూ.20 లక్షకుపైగా ఆదాయం పెరిగే అవకాశాలున్నాయి. కానీ మున్సిపల్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేస్తున్నారు.

భారీగా వసూళ్లు..!

లైసెన్స్‌లు సంబంధించి రెన్యువల్ బకాయిలను వసూలు చేసి బల్దియా ఆదాయాన్ని పెంచాల్సిన సిబ్బంది తమ జేబులు నింపుకుంటున్నారు. పాత లైసెన్స్‌ల బకాయిలను వసూలు చేయకుండా వాటి స్థానంలో నూతన లైసెన్స్‌లు జారీ చేస్తున్నారు. గతంలో సానిటేషన్ విభాగంలో ఇలాంటి అక్రమాలకు పాల్పడి అచ్చినకాడిని దండుకుని బదిలీపై వెళ్లిన వారున్నారు. నాలుగేళ్ల క్రితం వచ్చిన ఓ అధికారి ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఇదే తరహాలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు, అలాగే పైస్థాయి అధికారులను భాగస్వాములను చేస్తూ వారికి కూడా డబ్బులు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు విచారణ జరిపితే సానిటేషన్ విభాగంలో భారీ కుంభకోణం గుట్టురట్టయ్యే అవకాశం ఉంది. ఈ విషయమై మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ నగేశ్‌ను వివరణ కోరగా తనకు ఏమీ తెలియదని సమాధానమిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని అడగగా.. విచారణ చేస్తామని, అక్రమవసూళ్లకు పాల్పడినట్లయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

రెండో రోజూ దంచికొట్టిన వాన



నర్వ గేటు వద్ద కుండపోతగా కురుస్తున్న వర్షం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తుపాన్ ప్రభావంతో జిల్లా అంతటా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం కూడా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ సారి రుతుపవనాలు ముందుగానే వస్తున్నట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. దీనికి తోడు తుపాన్ ప్రభావం కూడా కలిసిరావడంతో వర్షాలు దంచికొడుతున్నాయి. నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. హసాన్‌పల్లిలో తడిసిన ధాన్యం మొలకెత్తింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు నిలిచింది. బాన్సువాడ పట్టణంలోని రోడ్లు జలమయమయ్యాయి. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ చెరువును తలపించింది.



కామారెడ్డి పట్టణంలో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

చెరువులను తలపించిన రోడ్లు

జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. వర్షాకాలం సీజన్ రాకముందే నాలాలు, డ్రెయినేజీలు శుభ్రం చేయించాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బుధ, గురువారాల్లో కురిసిన వర్షాలతో రోడ్లన్నీ వరదనీటితో నిండిపోయి చెరవులను తలపించాయి. విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, కాకతీయనగర్, నిజాంసాగర్ రోడ్డు, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



హసన్‌పల్లిలో మొలకెత్తిన ధాన్యం



హసన్‌పల్లిలో ధాన్యం కుప్పల చుట్టూ నిలిచిన వర్షపునీరు

రూ.400 కోట్లు దాటిన బంగారు రుణాలు

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి



సీఈవోతో కలిసి కేక్ కట్ చేస్తున్న చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మంజూరు చేసిన బంగారు రుణాలు రూ.400 కోట్ల మైలురాయి చేరుకున్న సందర్భంగా నిజామాబాద్ నగరంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారం రుణాలు రూ.400 కోట్ల మైలురాయి చేరడంలో ప్రతి ఉద్యోగి పాత్ర ఉందని, ఈ ఘనతకు సహకరించిన ఖాతాదారులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు తమకు తాముగా లక్ష్యాన్ని ఏర్పర్చుకొని, ఆ దిశగా ప్రయత్నించాలన్నారు. బ్యాంకు ప్రగతిని ఇదే విధంగా కొనసాగించి, రాష్ట్రంలోనే అన్ని జిల్లాల కన్నా మెరుగైన స్థితికి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఈవో నాగభూషణం వందే, జీఎం లింబాద్రి, గజానంద్, సుమమాల, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సాగర్' వరద గేట్ల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టుతోపాటు వరద గేట్లు వాటి గేర్ బాక్సులను క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, జిల్లా నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. 'ప్రాజెక్టుల గేట్ల నిర్వహణ గాలికి!' శీర్షికన ఈ నెల 19వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. నిజాంసాగర్ ప్రాజెక్టును వారు సందర్శించి వరద గేట్లు, గేర్ బాక్స్‌లు, రోప్‌ల స్థితిగతులను తెలుసుకున్నారు. 20 గేట్లకు ఒరాలింగ్ పనులతోపాటు మిగతా గేట్లకు గ్రీసింగ్, ఆయిలింగ్ పనులు చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులు నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. వారి వెంట నీటిపారుదలశాఖ ఈఈ సోలోమాన్, క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ భూమారెడ్డి, ఏఈ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.



గేట్లను పరిశీలిస్తున్న అధికారులు

ధనిక రైతుల నియోజకవర్గంగా మారుస్తా

- గెలిచిన 14 రోజుల్లోనే కాళేశ్వరం పనుల పురోగతిపై సమీక్షించా
- పనులపై అసెంబ్లీలో రెండుసార్లు ప్రస్తావించాను
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పలుమార్లు సమస్యలను విన్నవించా
- చరిత్రలో నిలిచిపోయే ప్రాజెక్టు ఇది
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



భూంపల్లిలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని ధనిక రైతుల నియోజకవర్గంగా మారుస్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని భూంపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న కాళేశ్వరం ప్యాకేజీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన 14 రోజుల్లోనే కాళేశ్వరం ప్రాజెక్టు 22వ ప్యాకేజీ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించానని, పనులు పూర్తయితే ఈ ప్రాంత రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రిజర్వాయర్ పనులు నిలిపి వేశారని, తాను పలుమార్లు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించడంతోపాటు రెండు సార్లు అసెంబ్లీలో చర్చించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించగా తక్షణమే రూ.23 కోట్లు మంజూరయ్యాయని, 14,500 ఎకరాలకు సాగునీరందించడానికి ఆస్కారం ఉంటుందని అధికారులు సూచించినట్లు తెలిపారు. కాటేవాడి, ధర్మారావ్‌పేట్, మోతె, రిజర్వాయర్‌ల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. సదాశివనగర్ మండలంలో 24,590 ఎకరాలు, గాంధారి మండలంలో 13,546 ఎకరాలు, రామారెడ్డి మండలంలో 8,664 ఎకరాలు, తాడ్వాయి మండలంలో 20,220 ఎకరాలు, రాజంపేట మండలంలో 2,593 ఎకరాలు, లింగంపేట మండలంలో 22,934 ఎకరాలు, ఎల్లారెడ్డి మండలంలో 3,200 ఎకరాలు, నాగిరెడ్డిపేట మండలంలో 3,100 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. నిజామాబాద్ జిల్లా కొండెం చెరువు లింక్ ద్వారా 11.5టీఎంసీల నీటితో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి ఇంకా 3వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తాను స్వయంగా రూ.8 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గ్రామ గ్రామాన బోర్లు తవ్వించి తాగునీటి సౌకర్యం కల్పించానన్నారు. భూంపల్లి రిజర్వాయర్ 22వ ప్యాకేజీకి నిధుల మంజూరులో మాజీమంత్రి షబ్బీర్ అలీ కృషి ఉందా అని విలేకరులు ప్రశ్నించగా, తాను పలుమార్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి సమస్యను విన్నవించడంతోనే నిధులు మంజూరు అయినట్లు సమాధానమిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యే దాక పట్టు వదలనని స్పష్టం చేశారు.

అలాగే నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. మూడు నుంచి ఆరు నెలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, వైస్ ఎంపీపీలు శ్రీనివాస్ రెడ్డి, రూపేందర్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దీన్, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బాగయ్య, మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్, నవీన్‌రావు, విండో చైర్మన్ గంగాధర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ప్రారంభం

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్వహించిన ఫస్టియర్ పరీక్షలకు జనరల్ విభాగంలో 1,300 మందికి గాను 1,229 మంది హాజరుకాగా 71 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 321 మందికిగాను 293 మంది హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్ పరీక్షలకు జనరల్ విభాగంలో 462 మందికి గాను 429 మంది హాజరుకాగా 33 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విభాగంలో 16 మంది విద్యార్థులకుగాను 13 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని సాందీపని కళాశాల ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ రాజేశ్‌చంద్ర గురువారం సందర్శించారు. కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

సెకండియర్ ఎగ్జామ్‌కు ఏక్‌నిరంజన్



హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో ద్వితీయ సంవత్సరం పరీక్షను ఒక్కే ఒక్క విద్యార్థి పరీక్ష రాశాడు. అయితే ఇక్కడ ఆరుగురు అధికారులు ఎగ్జామినేషన్ విధులు నిర్వర్తించారు. ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షలకు 32మందికి గాను 30మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్ పరీక్ష కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే రాశాడు. అయితే పరీక్ష నిర్వాహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, ఒక ఇన్విజిలేటర్‌తోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించారు.

ఆపరేషన్ కగార్ హత్యాకాండ



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్: ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ కొనసాగిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మఢ్ అడవుల్లో మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27 మందికిపైగా మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారని ఆరోపించారు. శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే కోరిందని, ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ గౌడ్, మోతీరాం నాయక్, కొత్త నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



మురిపించిన మేఘం

ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు చూపరులను మురిపించాయి. ఆ నల్లని మేఘాల్లో నుంచి కనిపించిన మెరుపులకు ఉరుముల శబ్దాలు తోడయ్యాయి. వాతావరణం పూర్తిగా చల్లబడి నల్లని మేఘాలు కమ్మేయడం మద్నూర్ మండలంలోని జాతీయ రహదారి మీదుగా ప్రయాణించిన వాహనదారులకు ఆహ్లాదాన్ని కలిగించింది. మేనూర్ శివారులో ఈ అద్భుత దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– మద్నూర్(జుక్కల్)

క్లుప్తంగా

విద్యుత్ సింగిల్ విండో ఏర్పాటు

కామారెడ్డి అర్బన్: ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు హై టెన్షన్ 11, 33 కేవీ ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరు సులభం, వేగవంతం చేసేందుకు సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు సంస్థ ఎస్ఈ ఎస్ శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. హెచ్‌టీ 11 కేవీ ఆన్‌లైన్ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్, 33 కేవీ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ కార్పొరేట్ పర్యవేక్షించి అన్ని పత్రాలు సరిగా ఉంటే రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలను రూపొందిస్తారని, మౌలిక వసతులు ఏర్పాటు చేసి అత్యంత వేగంగా సర్వీసు మంజూరు చేస్తారని ఎస్ఈ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనాస్థలం పరిశీలన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రం సమీపంలోని 161 జాతీయ రహదారిపై గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని గురువారం సీఐ నరేష్ పరిశీలించారు. ఈ ప్రమాదంలో డాక్టర్ పండరి అనే వ్యక్తి తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. దీంతో ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై మహేందర్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలో నిలుస్తున్న నీరు



గన్‌పూర్(ఎం)లో రోడ్డుపై నిలిచిన నీరు

మాచారెడ్డి : మండలంలోని గన్‌పూర్(ఎం) గ్రామంలో ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈగుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏమరుపాటుతో వాహనాలు నడిపితే గుంతల్లో పడిపోయే ప్రమాదముందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల గన్‌పూర్ తండాకు చెందిన ఓ వాహనదారుడు గుంతలో పడగా స్వల్ప గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి అర్హత సాధించిన రిషివంత్



విద్యార్థి రిషివంత్

కామారెడ్డి టౌన్: ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష- 2025లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి లక్కాకుల రిషివంత్ ఉత్తీర్ణత సాధించాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు రిషివంత్‌కు అభినందలు తెలిపారు.

వర్షంతో రోడ్లన్నీ జలమయం



బాన్సువాడలో ఎస్‌బీఐ బ్యాంకు ముందు నిలిచిన వర్షపు నీరు



కామారెడ్డి పట్టణంలో వర్షం నీటిలో నుంచి వెళ్తున్న వాహనాలు

- రెండు రోజులుగా కురుస్తున్న వానలు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు

బాన్సువాడ/నిజాంసాగర్/నాగిరెడ్డిపేట/లింగంపేట/పెద్దకొడప్‌గల్ : జిల్లావ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల రోడ్లన్నీ జలమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాన్సువాడలో కురిసిన భారీ వర్షానికి ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా భారీగా వర్షపు నీరు నిలిచింది. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తుంది. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నీరు చేరడంతో ధాన్యం మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. లింగంపేట మండలంలో కురిసిన వర్షానికి పంట చేనుల్లో మడికట్లు నిండాయి. పెద్దకొడప్‌గల్ మండలంలో వర్షంతో లోతట్టు ప్రాంతాలన్ని నీటితో నిండిపోయాయి. రోడ్లపై గుంతలలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



పోచారం పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు



పెద్దకొడప్‌గల్‌లో కురుస్తున్న వర్షం



లింగంపేటలో భారీ వర్షంతో నిండిన మడికట్లు

కూలిన ఇళ్ల పరిశీలన



భిక్కనూరులో వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

భిక్కనూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు మండల కేంద్రంలో రెండు నివాసపు ఇళ్లు గురువారం కూలిపోయాయి. మండల కేంద్రానికి చెందిన పోచమ్మ, బసగళ్ల ఎల్లయ్య నివాసం ఉంటున్నా ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈవిషయాన్ని బాధిత కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు, వెంటనే మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆస్తి నష్టం అంచనా వేసి పంచనామా నిర్వహించారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ జన్మదిన వేడుకలను కలెక్టరేట్‌లో, జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దళితులు, బడుగు వర్గాల హక్కుల కోసం భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలను కలెక్టర్, ఎస్పీ కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఏవో తిరుమల ప్రసాద్, మార్కెటింగ్ అధికారిణి రమ్య, అదనపు ఎస్పీ నర్సింహా రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్కి వెంకట్‌రావు పంతులు ఆధ్వర్యంలో నవగ్రహ ముఖ్యదేవతాపూజ, అవాహిత దేవతా హోమం, హారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కుర్మ, యాదవ సంఘం ప్రతినిధులు కోరారు.

ఆలయంలో చోరీ

దోమకొండ: మండల కేంద్రంలోని వీరబ్రహ్మంగారి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుండగులు గుడిలోని హుండీని పగులగొట్టి డబ్బులను దొంగిలించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కంది రాజయ్య తెలిపారు. ఈమేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

వాహనాల తనిఖీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి గ్రామ శివారులోగల బాన్సువాడ-గాంధారి ప్రధాన రహదారిపై గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై రంజీత్ ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. బైక్‌లు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లలో అవినీతి సహించం



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవినీతికి పాల్పడితే సహించమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. అధికారులుగాని, కమిటీ సభ్యులుగాని అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట రైతువేదికలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన మంజూరుపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని ఆయన చెప్పారు. అంతకు ముందు మండలంలోని జలాల్‌పూర్, గోపాల్‌పేట, మాల్తుమ్మెద గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 120 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఎల్లారెడ్డి మండలంలోని దావల్ మాల్క పల్లి, సబ్దల్‌పూర్ గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే మదన్‌మోహన్ భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నుత్వరితగతిన పూర్తి చేయాలని ఆయన లబ్దిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి, మాజీచైర్మన్ వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, , మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్, డీఎల్‌పీవో సురేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డిపేట మాజీసర్పంచ్ విఠల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రభాకరచారి, పార్టీ నాయకులు తదితరులున్నారు.

ఏటీసీ సెంటర్ నిర్మాణ పనుల పరిశీలన



ఎల్లారెడ్డి పట్టణ శివారులో టాటా సంస్థ సహకారంతో రూ. 70 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఏటీసీ (అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్) నిర్మాణ పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, టాటా సంస్థ సంయుక్త నిర్వహణలో ఎల్లారెడ్డిలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కేంద్రంలో టాటా సంస్థ సహకారంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. నియోజకవర్గంలో ఈ సెంటర్ ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ,ఉపాధి కల్పనకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. తాను చేసిన అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఏటీసీ కేంద్రం మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ఈ ప్రాంత నిరుద్యోగ యువతి యువకుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన అన్నారు.

అభివృద్ధిబాటలో ఎర్రాపహాడ్ పాలశీతల కేంద్రం

తాడ్వాయి : రాష్ట్రంలో ఎర్రాపహాడ్ పాలశీతల కేంద్రం అభివృద్ధి బాటలో నడుస్తుందని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. మండలంలోని ఎర్రాపహాడ్ బీఎంసీ ఆవరణలో గురువారం 8 వేలలీటర్ల నుంచి 15 వేల లీటర్ల సామర్థం గల కేంద్రంను నిర్మించడానికి తెలంగాణా పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంఘం చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డితో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిల్లులు రాక పాడిరైతులు ఇబ్బందులను ఎదర్కొంటున్నారని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 100 కోట్లు విడుదల చేశారన్నారు. పాలకేంద్రం సామర్థ్యాన్ని 15 వేల లీటర్ల నుంచి 40వేల లీటర్ల వరకు పెంచాలని రైతులు కోరారు. అంతకు ముందు తెలంగాణా రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంఘం చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై పశవుల దాణను త్వరలోనే సరఫరా చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్, అమిత్ రెడ్డిలు కలసి బీఎంసీ ఆవరణలో మొక్కలను నాటారు. ఉత్తమ రైతులకు పాల క్యానులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎంసీ చైర్మన్‌లు నరసింహారెడ్డి, తిరుపతిరెడ్డి, కార్యవర్గ సభ్యుడు కిష్టారెడ్డి, డీడీ నందకుమారి, మేనేజర్ రవిందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఆయా పాల కేంద్రాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కిన భార్యాభర్తలు

- ఆత్మహత్యకు యత్నం.. కాపాడిన పోలీసులు



రామారెడ్డి: కుటుంబంలో నెలకొన్న సమస్యలతో భార్యాభర్తలిద్దరూ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. రామారెడ్డి గ్రామానికి చెందిన దంపతులు అరుణ, శంకర్ గురువారం రామారెడ్డిలోని పెద్దమ్మ దుబ్బ మిషన్ భగీరథ ట్యాంక్ పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గ్రామస్తులు భార్యాభర్తలను సముదాయించి కిందకి దించారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యలుంటే పరిష్కరించుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కుటుంబంలో నెలకొన్న సమస్యలతోనే వారు ట్యాంకు ఎక్కినట్టు సమాచారం.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

రుద్రూర్: మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, సులేమాన్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని గురువారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా జడ్జి అతడికి ఒకరోజు జైలు శిక్ష , రూ. 2వేలు జరిమానా విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ 14మంది పట్టుబడ్డారు. వారికి గురువారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా జడ్జి 11 మందికి రూ.20,500 జరిమానా, ముగ్గురికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. అలాగే నగరంలోని సాయిరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా మాక్లూర్ మండలంలోని దుర్గానగర్ తండాకు చెందిన బంటు చిన్న మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. గురువారం అతడిని కోర్టులో హాజరు పర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

హోటల్ నిర్వాహకుడికి..

ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్‌గార్డెన్ వద్ద ఉన్న గ్లామర్ హోటల్‌ను సమయపాలన పాటించకుండ తెరిచి ఉంచడంతో నిర్వాహకుడు ఎండీ అర్షదుద్దీన్‌ను పట్టుకున్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. గురువారం అతడిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధించారన్నారు.

ఆవులను ఎత్తుకెళ్లే ముఠా అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న ముఠాసభ్యులు

ఖలీల్‌వాడి: ఆవులకు మత్తు మందు ఇంజక్షన్లు ఇచ్చి కారుల్లో ఎత్తుకెళ్లే ముఠాను పట్టుకున్నట్లు సీసీఎస్ సీఐ సురేష్ గురువారం తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్, ముంబాయికి చెందిన ఆరుగురు ముఠా సభ్యులు సయ్యద్ ఉమర్, సయ్యద్ ఆమీర్, అబ్దుల్ కలామ్, సయ్యద్ సోయాబ్, సమీర్‌ఆలీ, మహబూబ్‌అలీలు కార్లపై ప్రెస్, పోలీస్ బోర్డులు పెట్టుకుని దొంగ నెంబర్ ప్లేట్లతో నడుపుతూ ఆవులను ఇన్నోవా వెహికల్, ఇతర వాహనాలలో దొంగతనంగా తరలించేవారన్నారు. కార్లలో సీట్లు తీసివేసి ఆవులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి, ఎక్కించేవారన్నారు. నాందేడ్‌కు ప్రత్యేక బృందంతో వెళ్లి, రెండు రోజులు గాలించి ముఠా సభ్యులు పట్టుకున్నట్లు తెలిపారు. ముఠా సభ్యులపై చర్యలు తీసుకునేందుకు మహారాష్ట్రలోని దెగ్లూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. సీసీఎస్ సిబ్బంది యాదగిరి, సుభాష్, నీలేష్, నరేష్ ఉన్నారు.

బాలిక అదృశ్యం

వర్ని: మండలంలోని జాకోర గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ప్రవళిక (14) అదృశ్యమైనట్లు పోలీసులు గురువారం తెలిపారు. వారం రోజుల నుండి బాలిక కనబడటం లేదని తల్లి అనిత గురువారం వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని హబీబ్ నగర్‌లో ఇటీవల ఒకరిపై కత్తితో దాడి చేసి గాయపర్చిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. హబీబ్‌నగర్‌లోని షేక్ షహబాత్ (24)పై ధర్మపురిహిల్స్‌కు చెందిన షేక్ హర్షద్ (20) దాడి చేయగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పర్మళ్ల తండాలో వివాహిత అదృశ్యం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల తండాకు చెందిన బాదావత్ వసంత అదృశ్యమైనట్లు ఎస్సై రాఘవేంద్ర గురువారం తెలిపారు. తాడ్వాయి మండలం గుండారం పంచాయతీ పరిధిలోని హత్‌గుండు తండాకు చెందిన వసంతకు పర్మళ్ల తండాకు చెందిన బాదావత్ ప్రకాశ్‌తో ఈ నెల 4న వివాహం జరిగింది. ప్రకాశ్‌తో ఉండడం ఇష్టంలేదని వసంత తరుచూ చెప్పినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. గత మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు తెలిపారు. భర్త ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలుడిపై కుక్కల దాడి



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రం ఎల్లమ్మ కుచ్చలో గురువారం ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు రాంచదర్‌పై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. మూడు కుక్కలు ఒకేసారి వెంటపడి దాడి చేయగా ముఖానికి, చేతికి గాయాలు అయ్యాయి. బాలుడిపై కుక్కలు దాడిచేయడంతో కేకలు వేయగా తల్లిదండ్రులు బయటకు వచ్చి కుక్కలను తరిమి కొట్టడంతో ప్రమాదం తప్పింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

బావిలో ఈత నేర్చుకోడానికి వెళ్లి బాలుడి మృతి



వర్ని: బావిలో ఈత నేర్చుకోవడానికి వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వర్ని మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన తాన్ సింగ్ (13) గురువారం గ్రామ శివారులో ఉన్న బావిలో ఈత నేర్చుకోవడానికి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్లాడు. బావిలోకి దిగి ఈత నేర్చుకుంటుండగా నీళ్ల ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు నీటా మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాంచందర్ ఫిర్యాదు మేరకు వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటిగుంతలో పడి గొర్లకాపరి..

ఇందల్వాయి: మండలంలోని డొంకల్ గ్రామంలో ఓ గొర్ల కాపరి నీటిగుంతలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. డొంకల్ గ్రామానికి చెందిన గొల్ల చిన్న సాయిలు(57) అనే గొర్ల కాపరి బుధవారం ఉదయం ఎప్పటిలాగానే గొర్లను మేపడానికి గ్రామ శివారుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామం వద్ద గల 63నంబర్ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. రహదారిపై బైకు, టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో బైక్ నడుపుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. టాటా ఏస్ వాహనం డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అతడిని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

డిచ్‌పల్లి: మండలంలోని తెలంగాణ యూనివర్సిటీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. గురువారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పంచాయతీ కార్యదర్శి జయశ్రీకి సమాచారం అందజేశారు. వెంటనే ఆమె డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహంపై నలుపురంగు ప్యాంట్ ఉందన్నారు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉంటుందన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే డిచ్‌పల్లి పోలీసులకు గాని, 8712659851, 8712659852కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎడపల్లిలోని అందాపూర్ నర్సింలు ఇంటికి తాళం వేసి, రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున దుండగులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చి చూడగా, చోరీని గుర్తించి, యజమానికి సమాచారం అందించారు. కుటుంబీకులు ఎడపల్లికి పోలీసులకు ఫిర్యాదు చేయగా రూరల్ సీఐ విజయ్ బాబు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ధాన్యం లారీ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేటలోగల కోదండ రామాలయం వద్ద గురువారం సాయంత్రం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ జాఫర్‌కు గాయాలయ్యాయి. లారీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి మెయిన్‌రోడ్డుపైకి వచ్చే క్రమంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం గోపాల్‌పేటలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. లారీలోని ధాన్యం బస్తాలు తడిచిపోకుండా లావర్లను కప్పారు.

సాంబార్‌లో పడి బాలుడికి..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రెండేళ్ల బాలుడు మధుర సాత్విక్ ప్రమాదవశాత్తు సాంబార్‌లో పడి తీవ్రంగా గాయపడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గాంధారి మండలం గౌరారం తండాలో గురువారం జరిగిన వివాహ వేడుకకు సాత్విక్ తల్లిదండ్రులు రాజ్‌కుమార్, లలితలతో కలిసి వెళ్లాడు. సాయంత్రం సాత్విక్ ఆడుకుంటూ సాంబార్‌లో పడిపోయాడు. వెంటనే స్థానికులు గుర్తించి బాలుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

స్తంభం పైనుంచి పడి యువకుడికి..

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతుండగా ఓ యువకుడు స్తంభం పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. నర్సింగ్‌పల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు మతిన్ అనే కాంట్రాక్టర్‌కు అధికారులు పనులు అప్పగించారు. కాంట్రాక్టర్ వద్ద పని చేసేందుకు కందకుర్తి నుంచి ముషీర్ అనే యువకుడు వచ్చాడు. పనులు చేస్తున్న క్రమంలో ముషీర్ స్తంభం పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయమై ఏఈ నాగశర్వాణిని 'సాక్షి' వివరణ కోరగా, ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించామని తెలిపారు.